RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:25 15-7-2025 మంగళవారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4

## గవర్నర్ పదవికి

## అశోక్ గజపతిరాజు వన్నె తేవాలి: సీఎం, లోకేష్



అమరావతి, జులై 14,(టుడే విదుర) : గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజును నియమించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన గౌరవం అని అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము , ప్రధాని నరేంద్ర మోదీకి , కేంద్ర మంత్రివర్గానికి కృతజతలు తెలియజేశారు. అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా ఆ పదవికి వన్నె తేవాలి అని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆకాంక్షించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అశోక్ గజపతిరాజుకు సీఎం, మంత్రి విషెస్ తెలియజేశారు.

చంద్రబాబు ట్వీట్

'గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజుకు అభినందనలు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దక్కిన గౌరవం. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు. గవర్నర్‌గా తన విధుల నిర్వహణలో అశోక్ గజపతి రాజు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## అధికారులకు మంత్రి నారా లోకేష్ స్వీట్ ఛాలెంజ్



మంగళగిరి, జులై 14,(టుడే విదుర) : ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ఈ క్రమంలో విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వంద రోజుల్లో గుంతలు లేని రోడ్లు ఉన్న నియోజకవర్గంగా మంగళగిరి ని తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతలో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ను నెం.1గా తీర్చిదిద్దేలా సుమారు రూ.4.40 కోట్ల విలువైన ఐదు అధునాతన వాహనాలను మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. చెత్తను తరలించేందుకు రెండు రిఫ్యూజ్ కాంపాక్టర్ మెషిన్ వాహనాలు, రెండు స్వీపింగ్ మెషిన్ వాహనాలతో పాటు బీటీ రహదారులు గుంతలు పూడ్చే అధునాతన పాత్ హోల్ రోడ్ రిపేర్ వాహనాన్ని ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ జెండా ఊపి ప్రారంభించారు. ట్రాక్టర్లు, ఆటోల ద్వారా సేకరించిన వ్యర్థాలను ఈ కాంపాక్టర్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించనున్నారు. ఎంటీఎంసీ పరిధిలో బీటీ రోడ్లపై ఎప్పటికప్పుడు గుంతలు పూడ్చేందుకు రూ.1.48 కోట్ల విలువైన పాత్ హోల్ రిపేర్ వాహనంతో పాటు సుమారు రూ.1.2 కోట్ల విలువైన రెండు స్వీపింగ్ మెషిన్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. స్వచ్ఛ మంగళగిరి సాధనకు ఈ అధునాతన వాహనాలు దోహదపడనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరిని గుంతలు లేని రోడ్లు ఉన్న నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు వంద రోజుల ఛాలెంజ్‌ను అధికారులు స్వీకరించాలన్నారు. వంద రోజుల తర్వాత రోడ్లపై ఏమైనా గుంతలు ఉంటే వాట్సాప్ లేదా స్వచ్ఛాంధ్ర యాప్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా కసరత్తు చేయాలని ఆదేశించారు. మంత్రి లోకేష్ ఛాలెంజ్ ను తాము స్వీకరిస్తున్నామని, స్వచ్ఛతలో మంగళగిరిని నెం.1 తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా అధికారులు చెప్పారు.

## త్వరలోనే పేర్ని నాని జైలుకు..

## టీడీపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



అమరావతి, జులై 14,(టుడే విదుర) : వైసీపీ అవినీతి, దురాగతాలు రోజుకొకటి బయపడుతున్న వేళ డైవర్షన్ పాలిటిక్స్‌కి వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పేర్ని నాని తెరలేపారని తెలుగుదేశం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా విమర్శించారు. ప్రశాంతమైన పామర్రులో పేర్ని నాని అల్లర్లు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పేర్ని నాని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రౌడీలు, కిరాతకులు చేసే పనులకు.. పేర్ని నాని బ్యాచ్‌కు ఏం తేడా ఉందని ప్రశ్నించారు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా.(సోమవారం) అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో వర్ల కుమార్ రాజా మీడియాతో మాట్లాడారు. రాత్రులు ఎవరూ దాడులు చేస్తారనే అశాంతితో పామర్రు రైతులు ఉన్నారని చెప్పుకొచ్చారు. పేర్ని నాని వ్యాఖ్యలపై, ఫోన్ సంభాషణపై జగన్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఏపీలో అశాంతిని సృష్టించేందుకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి జగన్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ అమలుతో జగన్ రెడ్డిలో ఆందోళన మొదలైందని అన్నారు. వైసీపీ నామరూపాలు లేకుండా పోతుందనే భయపడే పేర్ని నానితో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదీశారని ఆక్షేపించారు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా.

## విశాఖపట్నం పోర్ట్ వరల్డ్ టాప్ 20 :

## కేంద్ర షిప్పింగ్ మంత్రి సోనోవాల్




విశాఖపట్నం, జులై 14,(టుడే విదుర): విశాఖపట్నం పోర్ట్ ప్రపంచంలోని 20 అద్భుత నౌకాశ్రయాలలో ఒకటని కేంద్ర షిప్పింగ్ మంత్రి సోనోవాల్ చెప్పారు. ఇవాళ విశాఖ వచ్చిన ఆయన 320 కోట్ల రూపాయలతో చేసిన పోర్ట్ ఆధునీకరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కేంద్ర మంత్రి బిమ్స్ టెక్ పేరుతో మ్యారి టైం కాంక్లేవ్ నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన నిపుణులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సదస్సులో అంతర్జాతీయ వాటర్ వేస్, మారిటైమ్ ట్రేడ్ కి సంబంధించి అర్థవంతమైన చర్చ జరిగింది. ఈ సందర్భంలో మారి టైం ట్రాన్స్ పోర్ట్ అగ్రిమెంట్ జరిగింది. ఈ కాంక్లేవ్ కు ఆరు దేశాల నుండి 26 మంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి 'ఈ రోజు జరిగిన కాంక్లేవ్ మంచి ఫలితాలు ఇస్తుందని భావిస్తున్నాం. మారిటైమ్.. ట్రేడ్స్ పై ఫలప్రదమైన చర్చ జరిగింది. భవిష్యత్తులో క్రూయిజ్ రంగం కీలకంగా పనిచేస్తుంది. విశాఖ పోర్టు ప్రపంచంలో టాప్ 20 లో ఉంది. విశాఖపట్నం పోర్టు పరిధిలో 320 కోట్ల రూపాయల ప్రాజెక్టులకు ఈరోజు శంకుస్థాపన చేశాం.' అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నౌకాయాన శాఖ సహాయ మంత్రి ఠాకూర్, ఎంపీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

## 16న కేంద్ర మంత్రి వద్ద రేవంత్, చంద్రబాబు పంచాయతీ



(టుడే విదుర): ఢిల్లీ జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న ఢిల్లీ లో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది. మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు.

రేపు ఢిల్లీ వెళ్లనున్న చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు.

# బాలింతల మృతిపై విచారణ



జలుమూరు(సారవకోట), జూలై 14 (టుడే విదుర): బుడితి సామాజిక ఆసుపత్రిలో ఇద్దరు బాలింతలు మృతి చెందడంపై జిల్లా ప్రత్యేక వైద్యుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. టెక్కలి ఆసుపత్రిలో పనిచేస్తున్న జి.ప్రసునాంబ, వి.ప్రకాష్‌వర్మ, ఎం.పెస్థిబ చైతన్య, నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఎస్.శ్రీనుబాబు, జె.కాళీచరణ్‌తో కూడిన ఐదుగురు ప్రత్యేక వైద్య బృందం విచారణ చేపట్టారు. ఈనెల 7న ముగ్గురు గర్భిణులకు సిజేరియన్ చేయగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో 8వ తేదీ రాత్రి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కి రిఫర్ చేయగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. అయితే వీరి మృతికి కారణాలపై దర్యాప్తు నిర్వహించారు. గర్భిణులకు శస్త్ర చికిత్స చేసిన రోజున ఎవ రెవరు వైద్యులు ఉన్నారు.. ఎటువంటి మందులు అందించారు. వంటి అంశా లపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో నివేదికను తయారుచేసి జిల్లా సామాజిక ఆసుపత్రుల సమన్వయాధికారికి, కలెక్టర్‌కు నివేదించనున్నట్టు బృందం పేర్కొంది.

# మండుతున్న రాష్ట్రం



విశాఖపట్నం, జూలై 14 (టుడే విదుర): మేఘాల జాడ లేకపోవడంతో వేసవిలో మాదిరిగా రాష్ట్రంలో వేడి వాతావరణం కొనసాగుతోంది. వారం, పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. నరసాపురంలో 39.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నెల్లూరులో 39.4, కావలిలో 39.1, తునిలో 38.5 డిగ్రీలు నమోదయ్యాయి. దేశంలో తమిళనాడు, కోస్తా, రాయలసీమల్లోనే ఎండలు, వేడి వాతావరణం కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితి మరో రెండు రోజులు ఉంటుందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఈనెల 16న పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో 17వ తేదీ నుంచి కోస్తాలో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తర ఒడిశాకు ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే తప్ప కోస్తాలో గట్టి వర్షాలు కురిసే పరిస్థితి లేదని, లేదంటే.. రుతుపవనద్రోణి తూర్పుభాగం దక్షిణాది వైపుగా రావాలని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

# పోలీసుల పహారాలో ఫరీద్‌పేట



ఎచ్చెర్ల,జూలై 14 (టుడే విదుర): ఫరీద్‌పేట గ్రామం పోలీసుల పహారాలో ఉంది. ఈ గ్రామానికి చెందిన సత్తారు గోపి హత్యకు గురైన నేపథ్యం తో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులను భారీగా మోహ రించారు. ఫరీద్‌పేట ముఖ్య కూడలితో పాటు, నవ భారత్ ఫ్లైఓవర్, కొయ్యరాళ్ల కూడలి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో గోపి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం గ్రామంలోని శ్మశాన వాటికలో పోలీసుల బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ కేవీ మహేశ్వ రరెడ్డి పర్యవేక్షణలో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో సుమారు 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో సాధారణ పరిస్థితు లు వచ్చేంతవరకు బందోబస్తు కొనసాగుతుందని పోలీసు వర్గాలు తెలిపాయి. గోపితోపాటు బైక్ వెనుకన కూర్చున్న సత్తారు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు 12మందిపై కేసు నమోదు చేసి జేఆర్ పురం సీఐ ఎం.అవతారం దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. కాగా విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితర వైసీపీ నేతలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

# డీఆర్ వలసలో నవగ్రహ విగ్రహాల ధ్వంసం



జి.సిగడాం, జూలై 14 (టుడే విదుర):డీఆర్ వల స శివాలయం ప్రాంగణం లోని శనీశ్వరుని ఆలయం లో గల నవగ్రహ విగ్రహా లను అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగు లు ధ్వంసం చేశారు ఆల య అర్చకుడు ఉదయం ఆలయానికి చేరు కుని చూడగా విగ్రహాలు ధ్వంసమైనట్లు గుర్తించి గ్రామస్థులకు తెలిపాడు. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు చేరుకుని ఆలయాన్ని ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా పలు దేవాలయాలపై ఇటీవల కాలంలో జరుగుతున్న దాడుల నింది తులను పట్టుకోవడంలో ఎటువంటి పురగతిలేదని, హిందూ దేవాలయాలపై దాడులు చేయడం దారుణమని, తక్షణం బాధ్యులను అరెస్ట్ చేయాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



పాలకొండజూలై 14 (టుడే విదుర): మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు చెప్పినప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదని, చర్చల పేరున గత పది నెలల నుంచి కాలయాపం జరుగుతుందని అందుకే సమ్మె చేస్తున్నట్లు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర పంచాయతీ గౌరవ అధ్యక్షులు దావాలరమణారావు అన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా జులై 12న అర్ధరాత్రి ఇంజనీరింగ్ విభాగ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షరతుల్లేకుండా తల్లికి వందనంతో పాటు కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపు చేయాలన్నారు. జీవో 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, పెంపు కేటగిరి నిర్ణయ విషయంలో కూడా జరిగిన పొరపాట్లు సరిదిద్దాలని డిమాండ్ చేశారు. గత 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు జీవోలు ఇవ్వాలని, అమలుకు సంబంధిత మంత్రి కార్మిక సంఘాలతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి సమ్మె విరమించేలా చూడాలన్నారు ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని, తక్షణమే మున్సిపల్ కార్మికుల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో వై.హరిబాబు, ఎస్.బాబురావు, పి.రమేష్, ఐ.రాజు, కె.రాజేష్, నర్సింగరావు, రాము, సంజీవి, వేణు ఉన్నారు.

# చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి




ఎచ్చెర్ల, జూలై 14 (టుడే విదుర): ఎస్ఎం పురం గ్రామానికి చెందిన ఎస్ఎం పురపు నారాయణమ్మ(72) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నారాయణమ్మ ఏడాదిగా పక్షవాతంతో బాధపడుతూ ఎస్ఎం పురంలోని చిన్న కుమార్తె దుర్గ ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 10న ఉదయం 11 గంటల సమయంలో ఆమె స్పృహతప్పి ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. ఆమె పక్కనే చీమల మందు నీటిలో కలిపిన పాత్ర కనిపించింది. ఆ నీటిని తాగి ఉంటుందని భావించి వెంటనే శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఉపాధి రీత్యా అనకాపల్లిలో ఉంటున్న నారాయణమ్మ కుమారుడు లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్వల్పంగా తగ్గిన గోదావరి




పోలవరం, ధవళేశ్వరం, యలమంచిలి,జూలై 14 (టుడే విదుర): ఏలూరు జిల్లా పోలవరంలో గోదావరి వరద శాంతించింది. దీంతో పునరావాస కేంద్రాలకు చేరుకున్న ముంపు ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం వద్ద ఉదయం 41.30 అడుగులు నమోదవగా, సాయంత్రానికి 30.60 అడుగులకు చేరింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 7,29,590 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద చుట్టుముట్టింది. లంక భూములు నీటమునిగాయి. కడెమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు మూసి వేయడంతో వరద స్లూయిజ్ గేట్లను ముంచెత్తింది. ధవళేశ్వరం వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలకడగా కొనసాగి ఆపై తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని కనకాయలంక కాజ్ వేపై అడుగు మేర వరదనీరు ప్రవహిస్తోంది.

# విశాఖలో కుంభవృష్టి



విశాఖపట్నంజూలై 14 (టుడే విదుర): విశాఖనగరాన్ని వర్షం ముంచెత్తింది. మధ్యాహ్నం సుమారు రెండు గంటల పాటు జోరున కురిసిన వర్షానికి కాలువలు,డ్రెయినేజీలు నిండిపోయి వరదలా పారింది.పలుప్రాంతాల్లో వాహనాలు సైతం కొట్టుకుపోయాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం 2గంటలకు ఒక్కసారిగా మేఘాలు కమ్మేసి ఉరుములు, పిడుగులతో భారీవర్షం కురిసింది. రోడ్లపై పార్కుచేసిన ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. సీతమ్మధారలో 34.0,ధారపాలెంలో 24 మి.మీ. వర్షపాతం నమోదైంది.పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశాకు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో నాటికి అల్పపీడనం ఏర్పడనుంది. ఇంకా మధ్యప్రదేశ్‌లోని మధ్య, ఉత్తర ప్రాంతంలో మరో ఉపరితల ఆవర్తనం ఆవరించింది.దీని ప్రభావంతో మధ్యప్రదేశ్‌లోని వాయువ్య భాగంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఈ రెండు అల్పపీడనాల ప్రభావంతో ఒడిశా, శ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తూర్పు రాజస్థాన్‌లో పలుచోట్ల భారీ నుంచి కుంభవృష్టి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. దీంతో ఈనెల 17వ తేదీ నుంచి ఉత్తరకోస్తాలో వర్షాలు పెరగనున్నాయి.ఈ నెల 18, 19న కోస్తాలో అనేక చోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. కోస్తా, రాయలసీమలో అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత, ఉక్కపోతతో కూడిన వేడి వాతావరణం నెలకొంది.

# ఒంగోలు మెప్మాలో ఏం జరుగుతుంది?




♦ అవినీతి వ్యవహారాలపై ఎండీ తేజ్‌భరత్ సీరియస్

♦ %ఆర్పీలపై కఠినచర్యలు తీసుకోవాలని పీడీకి ఆదేశం

♦ ఇకపై బోగస్ పొదుపు గ్రూపులు ఏర్పాటు చేసే వారికి చుక్కలే

♦ గత అక్రమాలపై చర్యలు లేకపోవడమే కారణమా!

జూలై 14 (టుడే విదుర):పొదుపు మహిళల పేరుతో నకిలీ సంఘాలు సృష్టించి కోట్లు దండుకుంటున్న ఆర్పీల అవినీతిపై ఆ సంస్థ ఎండీ సీరియస్ అయ్యారు. అక్రమాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని పీడీ శ్రీహరిని ఆదేశించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అసలు మెప్మాలో ఏం జరుగుతుందోననే చర్చ జిల్లా అంతగా మొదలైంది. కొందరు ఆర్పీల అక్రమాలు వెలుగులోకిరావడంతో బాధిత పొదుపు మహిళలు సైతం ఇప్పుడిప్పుడే బయటకొచి అన్యాయాలను వివరిస్తున్నారు. రెండు నెలల క్రితం ఒంగోలు నగర పరిధి కేశవస్వామిపేటలో ఉండే యానాదులను మోసం చేసిన ఓ ఆర్పీ భారీగానే దండుకుంది. దీనిపై రచ్చకావడంతో తాను తీసుకున్న సొమ్ము చెల్లిస్తానంటూ సభ్యులకు సర్దిచెప్పుకుంది. నేటికీ ఎలాంటి చెల్లింపులు జరగకపోవడం, మరోవైపు అధికారులు సైతం చర్యలు తీసుకోకపోవడంతో అదేబాటలో మరికొందరు బోగస్ గ్రూపుల తయారీలో ఉన్నారు. తాజాగా పేర్నమిట్ట ఆర్పీపై వచ్చిన ఆరోపణలతో బోగస్ గ్రూపుల వ్యవహారాలు బయటకు వస్తున్నాయి. ఇప్పటికే ఈ భాగోతంలో కీలకపాత్ర వహించిన వారిని తప్పించగా, మరికొందరి పాత్రపై విచారణ సాగుతుంది. రాష్ట్రప్రభుత్వం పొదుపు సంఘాలను బలోపేతం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. వారి కోసం పలు పథకాలను అమలుచేస్తూ వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతుంటే.. ఒంగోలు మెప్మాలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతోంది. అక్కడ రోజుకో అవినీతి భాగోతం వెలుగులోకి వస్తోంది. వరుస పరిణామాల క్రమంలో మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ తేజ్ భరత్ సీరియస్ అయ్యారు. శఆయన జిల్లా అధికారి పీడీ శ్రీహరితో మాట్లాడారు. ఆర్పీల అవినీతి వ్యవహారాలపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. గత ఏడాది నుంచి మెప్మాలో ఆర్పీల అవినీతిపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురిస్తుంది. పొదుపు సభ్యుల ఆధార్ కార్డులను ఆన్‌లైన్‌లో మరోసారి సీడింగ్ చేసి, వారి పేరుతో నకిలీ పొదుపు గ్రూపుల తయారు చేయడాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది.పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో ఆర్పీల అవినీతి వ్యవహారం, నకిలీ గ్రూపులపై పీడీ శ్రీహరి విచారణకు సిద్ధమయ్యారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, అవినీతికి పాల్పడిన ఆర్పీల జాబితాను సిద్ధం చేస్తున్నారు. పొదుపు సంఘాల సభ్యులను మోసం చేస్తూ, బ్యాంకులను బురిడీ కొట్టిస్తూ కోట్లు దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. బోగస్ పేరుతో దోచుకున్న సొమ్మును రికవరీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో వారిలో ఆందోళన మొదలవ్వగా, మరికొందరు ఆర్పీలు తమపైకి వస్తే అందులో భాగస్వాములైన వారిని బయటకు లాగుతామంటూ బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంచితే, కేశవస్వామిపేటకు చెందిన యానాది సామాజికవర్గానికి చెంది పలు పొదుపు సంఘాల సభ్యులను మోసం చేసిన ఆర్పీపై చర్యలు లేకపోవడం, తాజాగా పేర్నమిట్టకు చెందిన ఆర్పీ బాధిత పొదుపు సంఘాల పట్ల ఇదే తీరుతో మాట్లాడటం విస్మయం కలిగిస్తుంది. ఇప్పటికైనా మెప్మాలో అవినీతికి అడ్డుకట్ట వేస్తారా? ఆ ఆర్పీలపై చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.గత వైసీపీ పాలనలో ఇబ్బడిముబ్బడిగా బోగస్ గ్రూపులు సృష్టించి సుమారు రూ.40 కోట్ల మేరదోచుకోగా, ఈ ఏడాది జనవరి నుంచి కూడా ఆ వ్యవహారం మళ్లీ మొదలైంది. ఇదిలా ఉంచితే మూడు నెలల క్రితం యానాది సామాజికవర్గం సభ్యులు ఆర్పీ తమను మోసం చేసిందంటూ రోడ్డెక్కగా.. తాజాగా పేర్నమిట్టకు చెందిన ఆర్పీ, దామచర్ల జనార్దన్ కాలనీకి చెందిన పొదుపు మహిళలు బయటకొచ్చారు. తమను మోసం చేసి, వారి పేరుతో నకిలీ గ్రూపులు తయారు చేసి రుణాలు తీసుకుందని విమర్శించారు. దీనిపై కథనం ప్రచురించింది. ఈ వ్యవహారం ఇటు కార్యాలయ ఉద్యోగుల్లోనే కాకుండా, అటు మెప్మా కేంద్ర కార్యాలయంలోనూ చర్చనీయాంశంగా మారింది. అసలు అక్కడ ఏమి జరుగుతోంది.. అధికారులు ఏమి చేస్తున్నారు.. అనే విషయాలను ఆరా తీస్తుంది.రాష్ట్రప్రభుత్వం ఇంటికో మహిళను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పలు పథకాలు అమలు చేస్తోంది. ఈ వాహనం,తృప్తి క్యాంటీన్, వీధి వ్యాపారాలకు ప్రోత్సాహం, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, ఆహార తయారీ, రిటైల్ దుకాణాలు, డీజీ లక్ష్మి పథకంతో సేవా రంగాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకాలు ప్రతి పొదుపు మహిళకు చేరువ చేయాల్సి ఉందని, కానీ ఆ పథకాల పురోగతి మరిచి, ఆర్పీలు అవినీతికి పాల్పడటంపై శనివారం ఎండీ తేజభరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోగస్ గ్రూపులపై సమగ్ర విచారణ చేయాలని పీడీని ఆదేశించారు. అలాంటి వారిని నిర్మొహమాటంగా తొలగించి, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## అసాంఘిక శక్తులపై పోలీసుల ఉక్కుపాదం



నంద్యాల బ్యూరో జూలై 14 (టుడే విదుర): శాంతిభద్రతల పరిరక్షణ నేరం నియంత్రణలో భాగంగా తెల్లవారుజామున జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నిర్వహించారు.జిల్లాలోని అన్ సబ్ డివిజన్ పరిధిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో చేపట్టిన వివరాలు%ా%నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పోన్నాపురం కాలనీ నందు ఇన్స్పెక్టర్ కృష్ణయ్య ఎస్సై గంగ యాదవ్ ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో సరైన ధ్రువపత్రాలు లేని 6 వాహానాలను స్వాధీనం చేసుకోన్నారు.ఆత్మకూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కురుకుంద గ్రామం లో ఇన్స్పెక్టర్ రాము ఆధ్వర్యంలో సరైన ధ్రువపత్రాలు లేని పది మోటర్ సైకిల్ 14 క్వాటర్ బాటిల్లును స్వాధీనం చేసుకున్నారు.ఆత్మకూరు రూరల్ సర్కిల్ లో పాములపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జూటూరు గ్రామం లో ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి మరియు సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ నిర్వహణలో సరైన ధ్రువపత్రాలు లేని 09 మోటార్ సైకిల్లు,31 క్వాటర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.నందికొట్కూరు యు పి ఎస్ లో ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని జగనన్న కాలనీలో రికార్డులు లేని 10 బైక్‌లు మరియు 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.రూరల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండ్లెం గ్రామం, జూపాడుబంగ్లో లో సరైన రికార్డులు లేని 15 బైక్‌లు, 15 అక్రమ మద్యం బాటిల్లు, 7 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.ఆళ్లగడ్డ సబ్ డివిజన్ కోవెలకుంట్ల సర్కిల్ సంజామల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకుమల్ల గ్రామం లో ఇన్స్పెక్టర్ హనుమంతు నాయక్ సబ్ ఇన్స్పెక్టర్ రమణయ్య ల ఆధ్వరం లో సరైన ధ్రువపత్రాలు లేని 12 మోటార్ సైకిల్ 6 ఆటోలను స్వాధీనం చేసుకున్న రు.రుద్రవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసాపురం గ్రామం లో ఇన్స్పెక్టర్ దస్తగిరి బాబు సబ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో సరైన ధ్రువపత్రాలు లేని 21 మోటార్ సైకిలను స్వాధీనం చేసుకొన్నారు.

## పాముకాటుతో వ్యక్తి మృతి



ఎల్ఎన్ పేట,జూలై 14 (టుడే విదుర): శ్యామలాపురం గ్రామానికి చెందిన ఇప్పిలి జగదీశ్వరరావు(50) పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సాయంత్రం జగదీశ్వరరావు తన కోళ్లఫారంలోని కోడి తీస్తున్న సమయంలో కోడి కాళ్లగోళ్లు తగిలినట్లుగా అనిపించడంతో పట్టించుకోలేదు. పశువుల కోసం పక్కనే ఉన్న గడ్డికుప్పకు వెళ్లి గడ్డి తీసుకొని ఇంటికివచ్చేసరికి నోటి నుంచి సొంగలు వచ్చాయి. దీంతో వెంటనే ఆసుపత్రికి వెళ్లే క్రమంలో సరుబుజ్జిలి వచ్చేసరికి చనిపోయాడు. జగదీశ్వరరావుకి భార్య భానుమతి ఉంది.

## బుచ్చెంపేటలో కొట్లాట




రాజాం రూరల్, జూలై 14 (టుడే విదుర): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో పదిమంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఇద్దరు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరో ఐదుగురు రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాల మధ్య స్థలం విషయంలో ఉదయం వివాదం చెలరేగింది. రాత్రి వరకూ పెద్దల సమక్షంలో చర్చలు జరిగాయి. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇరువర్గాలు కొట్లాటకు దిగారు. పిట్టా రాము, సత్యం, ముద్దన సూరిబాబు, పిట్టా రాజేంద్ర తదితరులంతా గాయపడిన వారిలో ఉన్నారు. రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బుచ్చెంపేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

## పట్టుదల ఉంటే క్రీడల్లో రాణించవచ్చు



శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 14 (టుడే విదుర): క్రమశిక్షణ, పట్టుదల ఉంటే క్రీడల్లో రాణిం చవచ్చని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ గూడేన సోమేశ్వరరావు అన్నా రు. స్థానిక శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియంలో రెండు రోజు లుగా జరుగుతున్న జిల్లా బ్యాడ్మిం టన్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. క్రీడాకారులు రాణిస్తున్నారంటే వారి తల్లిదండ్రు ల ప్రోత్సాహం ఎంతైనా ఉ ందన్నారు. గెలుపు, ఓటము లు సమానంగా స్వీకరించాలన్నారు. జిల్లాలోని మారు మూల ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జిల్లాస్థాయి విజేత లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బైరి దామోదర్, ఎంఎంవిలేఖర్, గురుగుబెల్లి రాజు, ఎం.వేణు, సీఈవో సంపతిరావు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొడుకుతో వెళుతూ.. కానరాని లోకాలకు



సాలూరు రూరల్,జూలై 14 (టుడే విదుర): కొడుకుతో పొలానికి స్కూటీపై వెళ్లిన తండ్రి.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన సాలూరు గొర్లెవీధిలో చోటుచేసుకుంది. సాలూరు రూరల్ హెచ్‌సీ బంగా రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు పట్టణం గొర్లె వీధికి చెందిన గొర్లె ధర్మారావు(43)కు సాలూరు బైపాస్ రోడ్డులో పొలం ఉంది. ఆయన తన కొడుకు గుణశేఖర్(14)ను వెంట బెట్టుకుని స్కూటీపై పొలానికి వెళ్లారు. అక్కడ నుంచి తండ్రీ కొడుకులు బైపాస్ రోడ్డుపై జీగిరాం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో స్కూటీని వెనుక నుంచి ఓ గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ ఎగిరి పడ్డారు. స్కూటీని ఆ వాహనం కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటన లో ధర్మారావు తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడక్కడే మృతిచెందారు. గుణశేఖర్ గాయపడటంతో అతడిని తొలుత సాలూరు ఏరియా ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరంలో ఆసుపత్రికి తరలించారు.

# పక్కాగా హాజరు




జగిత్యాల, జూలై 14 (టుడే విదుర): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమయపాలనపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. టీచర్ల హాజరు కోసం ఫేషియల్ రికగ్నిషన్ ప్రవేశపెట్టనుంది. చాలామంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందడం లేదని, ప్రాథమిక పాఠశాలల్లో కొంత మంది విధులకు హాజరుకాకపోయినా మరుసటి రోజు రిజిస్టర్‌లో సంతకాలు పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పాటు పాఠశాలల పనివేళలకు ముందుగానే ఇంటిముఖం పట్టడం, వివిధ వ్యాపారాలు, ఇతర వ్యాపకాలలో నిమగ్నమవుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొవిడ్‌కు ముందు సర్కారు పాఠశాలల్లో బయోమెట్రిక్ అమలు చేశారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరయ్యారు. ఆ తర్వాత అవి మూలన పడడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ క్రమంలో టీచర్లకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేశారు. సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు అమలవుతున్న విషయం తెలిసిందే. టీచర్లకు కూడా అమలు చేస్తే సక్రమంగా విధులకు హాజరయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం ఉంది.

# పోడు భూముల్లో సాగు అడ్డుకుంటే ఊరుకునేది లేదు



నెన్నెల,జూలై 14 (టుడే విదుర): దశాబ్దాల నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు సాగు పనులను అడ్డుకుంటే ఊరుకునేది లేదని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐ కేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి హెచ్చరించారు. మండలంలోని జంగాల్‌పేట పంచాయతీ పరిధి కొత్తగూడెం శివారు భూముల్లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. అటవీశాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఈ భూములను స్థానిక గిరిజనులు సాగు చేసుకుంటున్నారని అన్నారు. కొందరికి 1/70 చట్టం ప్రకారం పట్టాలు కూడా ఉన్నాయన్నారు. ఆ భూమిని దున్నితే కేసులు పెడతామని అటవీ శాఖ వారు బెదిరిస్తున్నారని అన్నారు. ఎన్నికల కంటే ముందు అటవీ భూ ముల్లో సాగులో ఉన్నవారికి హక్కు పత్రాలు ఇస్తామని కాంగ్రెస్ నాయ కులు ఓట్లు దండుకొని, అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారని విమర్శించారు. ఆదివాసీల హక్కులను కాలరాసే జీవో నం. 49ను రద్దు చేయా లని డిమాండ్ చేశారు. భూములు దక్కేంత వరకు గిరిజనులకు అండగా పోరాడుతామన్నారు. మాజీ ఉప సర్పంచ్ చిలుకయ్య, నాయకు లు మంచాల మధునయ్య, నాగే ష్, వెంకటేష్, సాగర్, దిలీప్, క మల, దుర్గక్క, లక్ష్మీ, భీమక్క పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి



యాదగిరిగుట్టరూరల్,జూలై 14 (టుడే విదుర):ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం యా దగిరిగుట్టలోని ఆయా వార్డులలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గానికి ఇప్పటివరకు 3500 ఇళ్లు మంజూరయ్యాయని, అన్ని ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంటికి కావాల్సిన ఇ సుకతోపాటు సామగ్రి తక్కువ ధరకు ఇచ్చే విధంగా అధికారులు నం బంధిత యజమానులతో మాట్లాడాలని చెప్పారు. ఇసుక కొరత ఉంటే తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఉదయం 6గంటల నుంచి 10 గంటలవరకు పట్టణమంతా కలియదిరిగి, పట్టణ సమస్యలు అడిగి తె లుసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మిర్యాల లింగస్వా మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, మాజీ కౌన్సిల ర్లు సీస విజయలక్ష్మీకృష్ణగౌడ్, ముక్కెర్ల మల్లేశ్, ఎరుకల హేమేందర్‌గౌడ్, గుట్ట పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతిగౌడ్,రమేష్, జీవన్‌రెడ్డి,శ్రీనివాసరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

# ఇనుప కూలర్ తగిలి.. విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి




జైనథ్, జూలై 14 (టుడే విదుర):ఉమ్మడి మండలంలోని భోరజ్ పరిధిలో గల పెండల్‌వాడ గ్రామంలో విద్యుత్ షాక్‌తో బావానే అశోక్(56) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అశోక్ ఆయన కుమారుడు రవి, ఆయన భార్య సుమన్‌బాయి, తల్లి గిరిజాబాయి రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రకు ఉపక్రమించారు. అశోక్ ఎప్పటి లాగే ఇంటి ఎదుట గదిలో నిద్రించాడు. %రాత్రి 12 గంటల ప్రాంతంలో నిద్రమత్తులో మంచంపై నుంచి కుడి కాలు ఎదురుగా ఉన్న ఇనుప కూలర్‌పై పడడంతో విద్యుత్ షాక్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జైనథ్ ఎస్సై గౌతం నాయక్, ఏఎస్సై ఆత్మారాం శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# దేశంలో పేదల కోసం అవిశ్రాంత పోరాటం



ఉండవల్లి,జూలై 14 (టుడే విదుర): వంద ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గల సీపీఐ దేశంలో పేదలు, రైతుల పక్షాన నిలబడి వారి కోసం అవిశ్రాంత పోరాటాలు సాగించిందని సీపీఐ జాతీయ నా యకురాలు సురవరం విజయలక్ష్మి అన్నారు. ఈ క్రమంలో ఎన్నో ఉద్యమాలు చేసి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తుందని తె లిపారు. ఉండవల్లి మండలం కం చుపాడులో సురవరం విజ్ఞాన కేంద్రంలో రవి అధ్యక్షతన జరిగిన మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె సురవరం కపిల్, జిల్లా కార్యదర్శి ఆంజనేయుల తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అ నంతరం సురవరం విజయలక్ష్మి మాట్లాడుతూ దున్నే వాడికే భూమి కావాలని మొట్టమొదట నినదించిన పార్టీ సీపీఐ మాత్రమేనన్నారు. ఆ దిశగా పేదల పక్షాన పోరాటాలు సాగిన్తు వారికి అండగా నిలబడిందన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి పోరాడితే సమస్యలు పరిష్కా రమవుతాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఆం జనేయులు మాట్లాడుతూ జిల్లాలో అధికారు లు సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యార న్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఆగస్టు 4న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహాస భలను విజయవంతం చేయాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారు లకు, పెత్తందారులకు అనుకూలంగా చట్టాలను రూపొందించడం సరైంది కాదన్నారు.

# పెండ్లి పత్రికలు పంచడానికి వెళ్తూ.. రెండు కుటుంబాల్లో విషాదఛాయలు



ఖానాపూర్ టౌన్/జన్నారం, జూలై 14 (టుడే విదుర): మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ఇందన్‌పెల్లి గ్రామానికి చెందిన చొప్పదండి లక్ష్మణ్, వరుసకు బావమర్ది అయిన మురిమడుగు గ్రామానికి చెందిన పడిగెల జశ్వంత్‌లు కలిసి పెండ్లి పత్రికలు పంచడానికి వెళ్లారు. ఇటీవలే లక్ష్మణ్‌కు పెండ్లి సంబంధం కాయం కావడంతో ఈనెల 18వ తేదీన పెండ్లి పెట్టుకున్నారు. పెండ్లి ఇంకా నాలుగు రోజులే ఉండడంతో ఖానాపూర్, నిర్మల్ పట్టణాల్లో ఉన్న తమ బంధువులకు పత్రికలు ఇవ్వడానికి ఉదయం పల్సర్ బైక్‌పై బయలుదేరారు నిర్మల్ వైపు వెళు ండగా ఉదయం 11 గంటలకు ఖానాపూర్‌లోని కుమ్రం భీం చౌరస్తాలో అతివేగం వల్ల బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్లలోకి దూసుకెళ్లింది. తలకు బలమైన గాయాలు కావడంతో చొప్పదండి లక్ష్మణ్(25), పడిగెల జశ్వంత్(19)లు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. చొప్పదండి గంగన్న-కమల దంపతుల చిన్న కుమారుడు లక్ష్మణ్ మృతిచెందడంతో రోదనలు మిన్నంటాయి. ఇంకా నాలుగు రోజుల్లోనే పెండ్లి ఉండడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. లక్ష్మణ్‌కు ఒక అన్న, ఒక చెల్లి ఉన్నారు. జశ్వంత్ మృతదేహం వద్ద అతని తల్లిదండ్రులు భాగ్యలక్ష్మి-రాజన్న, అన్న వంశీ, బంధువులు రోదించిన తీరు అందరిని కలచివేసింది.

# తొలి వర్షానికే గొల్లఘాట్ వాసుల బురద కష్టాలు



తాంసి(భీంపూర్) :జూలై 14 (టుడే విదుర):మొదటి వర్షాలే గొల్లఘాట్ గ్రామస్థులకు కష్టాల్ని తెచ్చిపెట్టాయి. మండలంలోని ఈ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి తొలి వర్షం పడగానే పూర్తిగా బురద మయమై రాకపోకలకు ఆటంకాలుగా మారాయి. ఈ గ్రామానికి రోడ్డు లేక ఆర్టీసీ బస్సును ఎరగవు. ఇప్పటివరకు ఆటోలు, ద్విచక్ర వాహనాలే ప్రధాన రవాణా మార్గం. కానీ వర్షాల నేపథ్యంలో ఆ ఆటోలు కూడా రావడం లేదని వాపోతున్నారు. %ద్విచక్రవాహనదారులు పడుతూ.. లేస్తూ, దారికి తగిలే రాళ్లు, రప్పల వల్ల గాయాలపాలు అవుతున్నారు . ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, గర్భిణులు మరింత కష్టాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులకు రోడ్డు సమస్యను విన్నవించినా, వినతులు అందజేసినా పరిష్కారానికి మాత్రం చొరవచూపడం లేదు. వర్షాకాలం రాగానే ప్రతి సంవత్సరం ఇలాగే కష్టాల్ని ఎదుర్కోవాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజుల్లోనూ ఈ దారి ఇబ్బందిగానే ఉంటుంది.వర్షం కురిస్తే మాత్రం బురదలో కాళ్లు కదలడం కూడా కష్టమవుతుంది. పెద్ద పెద్ద వాహనాలు రాకపోవడంతో బయటకు వెళ్లే అవకాశం లేక ఇళ్లలో పరిమితం కావాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు.

# టుడే వినోదం

# అభినయ సరస్వతి బి.సరోజాదేవి కన్నుమూత




సీనియర్ నటి అభినయ సరస్వతి బి.సరోజాదేవి (87)కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యతో బాధపడుతున్న ఆమె యశ్వంతపుర మణిపాల్ ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జనవరి 7, 1938లో బెంగళూరులో జన్మించారు. తండ్రి బైరప్ప మైసూర్‌లో పోలీస్ ఆఫీసర్‌గా పని చేసేవారు. తల్లి గృహిణి. తండ్రి ప్రోద్బలంతో డాన్స్ నేరుకున్న ఆమె తదుపరి సినిమాలపై ఆసక్తి చూపారు. కన్నడ చిత్రం మహాకవి కాళిదాసుతో ఆమె నటిగా తెరంగేట్రం చేశారు. తెలుగులో 'పాండురంగ మహత్యం' తొలి చిత్రం. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్‌ల వంటి దిగ్గజ నటులతో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. తెలుగు, తమిళ, కన్నడ సినిమాలతో అభిమానులను సొంతం చేసుకొన్నారు. 'అభినయ సరస్వతి' బిరుదాంకితురాలయ్యారు. %తెలుగులో 'మహాకవి కాళిదాసు', 'భూకైలాస్', 'పెళ్లి కానుక', 'పెళ్లి సందడి', 'ఇంటికి దీపం ఇల్లాలే', 'జగదేకవీరుని కథ', 'శ్రీ సీతారామ కల్యాణం', 'దాగుడు మూతలు', 'ఆత్మబలం', 'అమరశిల్పి' జక్కన, శకుంతల, ఉమా చండీ గౌరీశంకరుల కథ, శ్రీ రామాంజనేయ యుద్ధం, సీతారామ వనవాసం, దానవీర శూరకర్ణ వంటి ఎన్నో హిట్ చిత్రాల్లో నటించారు. 1955 నుంచి 1984 మధ్య 29 ఏళ్ల పాటు వరుసగా 160కి పైగా సినిమాల్లో లీడ్‌రోల్‌లో నటించిన ఏకైక నటిగా సరోజా దేవి చరిత్ర సృష్టించారు. తెలుగులో ఆమె నటించిన చివరి చిత్రం 'దేవి అభయం'. కన్నడలో నటసార్వభౌమా (2019) చిత్రంలో గెస్ట్ రోల్ చేసారు. అదే ఆవిడా నటించిన చివరి చిత్రం. సినిమా రంగానికి ఆమె చేసిన సేవలకు గాను ప్రభుత్వం ఆమెను 1969లో పద్మశ్రీతో, 1992లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.పలు స్టేట్ అందుకున్నారు.



# రగులుతోంది మొగలి పొద రీమిక్స్..

## నిజమైన నాగినినే దింపుతున్నారుగా




: మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం నటిసున్న చిత్రాల్లో విశ్వంభర ఒకటి. బింబిసార సినిమాతో స్టార్ డైరెక్టర్ గా మారిన వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మొట్ట మొదటిసారి యూవీ క్రియేషన్స్ చిరు సినిమాను నిర్మిస్తుంది. ఇక ఈ సినిమాలో చిరు సరసన త్రిష నటిస్తుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎప్పుడెప్పుడు ఈ సినిమా రిలీజ్ అవుతుందా అని అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. కానీ, ఈ సినిమా మాత్రం ఇంకా రిలీజ్ డేట్ ను ఫైనల్ చేసుకోలేదు. అందుకో వస్తుంది.. ఇదిగో వస్తుంది అని చెప్పడమే కానీ, ఇప్పటివరకు రిలీజ్ డేట్ ను మేకర్స్ ప్రకటించలేదు. %భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా విఎఫ్ఎక్స్ పనులు ఇంకా అవ్వలేదని, అది అయ్యాకే రిలీజ్ చేయనున్నారని టాక్. ఒకటి కాదు రెండు కాదు ఎన్నో మంచి మంచి డేట్స్ ను వదిలేసుకుంది విశ్వంభర. ఇక ఇదంతా పక్కన పెడితే.. ఈ సినిమాలోని ఐటెంసాంగ్ గురించి కొన్నిరోజుల నుంచే పెద్ద చర్చనే నడుస్తోంది. చిరుతో స్టెప్స్ వేసే ఆ హాట్ బ్యూటీ ఎవరా.. ? అని అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. అది మాత్రమే కాకుండా విశ్వంభర కోసం చిరు హిట్ సినిమా ఖైదీలోని రగులుతోంది మొగలిపొద సాంగ్ ను రీమిక్స్ చేస్తున్నారు అని టాక్ నడుస్తోంది.

# బికినీలో.. మన్మథుడు అన్షు అందాల విందు




'తాగితే కదా.. నచ్చుతుందో లేదో తెలిసేది... అంటూ మన్మథుడు సినిమాలో మృదు మధుర స్వరం, అమాయకత్వంతో ఆకట్టుకున్న అన్షు ఇప్పుడు మాత్రం సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో గ్లామర్ షోతో నెట్టింట రచ్చ చేస్తోంది. రెండు దశాబ్దాల క్రితం నాగార్జున మన్మధుడు సినిమాతో ఎంట్రీ ఇచ్చి చేసిన రెండు మూడు సినిమాలతోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ తెచ్చుకున్న ఈ నటి ఆ చిత్రం తర్వాత ప్రభాస్‌తో రాఘవేంద్ర, తమిళంతో ప్రశాంతో ఓ సినిమా తెలుగులో గెస్ట్ పాత్రల్లో మాత్రమే నటించిన ఈ ముద్దుగుమ్మ ఆపై రీర్ ఊపందుకుంటున్న సమయంలోనే పెళ్లి చేసుకుని విదేశాలకు వెళ్లి పోయింది. %ఇటీవల సందీప్ కిషన్, రావు రమేశ్ మజాకాతో తిరిగి సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చింది. కానీ మూవీ అంతగా విజయవంతం కాకపోవడంతో ఏవైనా ఛాన్సులు వస్తే వస్తా అన్నట్లు విదేశాలకు తిరిగి వెళ్లిపోయింది. అయితే పెళ్లై ఇద్దరు పిల్లలున్నా ఈ అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్స్‌ను సంపాదించుకుంది. %తాజాగా తన భర్త , పిల్లలతో కలిసి దుబాయ్ ట్రిప్‌కు వెళ్లిన ఈ భామ అక్కడ ఓ ఖరీదైన హొటల్‌లో బస చేసి, స్విమ్మింగ్ పూల్‌లో సేద తీరుతూ అందాలు ఆరబోస్తూ అభిమానులకు సడన్ షాక్ ఇచ్చింది.

# కిరీటి ప్రామిసింగ్ స్టార్ అవుతాడు



గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'జూనియం రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ లో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. జూలై 18న ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ బెంగళూరులో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది. %శివరాజ్ కుమార్ మాట్లాడుతూ 'కిరీటీ నాకు చిన్నప్పటినుంచి తెలుసు. జూనియర్ టీజర్, ట్రైలర్,పాటలు చూశాను. కిరీటి చాలా అద్భుతంగా డాన్స్ చేశాడు. తన పెర్ఫార్మన్స్ చాలా బాగుంది. కిరిటి రూపంలో మరో ప్రామిసింగ్ స్టార్ ఇండస్ట్రీకి వస్తున్నాడు. తను డాన్స్ లో సూపర్ సీనియర్ అనిపిస్తున్నారు. అలాగే శ్రీలీల కూడా మంచి డ్యాన్సర్. వారి కెమిస్ట్రీ చాలా బాగుంది. జెనీలియా గుడ్ హ్యూమన్ బీయింగ్. తను ఈ సినిమాలో చాలా చక్కని పాత్ర పోషించారు. రవిచంద్రన్ తో నాకు ఎప్పటినుంచో స్నేహం ఉంది. ఆయన ఈ సినిమాలో అద్భుతమైన క్యారెక్టర్ చేస్తున్నారు. డైరెక్టర్ సినిమాని చాలా అద్భుతంగా తీశారని ప్రమోషనల్ కంటెంట్ చూస్తే అర్ధమవుతుంది.

# వైరల్ వయ్యారితో శివన్న స్టెప్పులు..

## కుర్ర హీరో ఖంగుతిన్నాడుగా




కొంతమంది సీనియర్ హీరోలను చూస్తే అసలు ఆ హీరోలకు వయస్సవుతుందా అనే అనుమానం కలుగకుండా పోదు. అలాంటి హీరోల్లో కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ ఒకరు. అంటే ఫేస్ పరంగా కాకపోయినా ఆయన ఎనర్జీ మాత్రం వేరే లెవెల్ అని చెప్పాలి. ఈ వయస్సులో కూడా కుర్ర హీరోలకు ధీటుగా డ్యాన్స్ వేయడం అంటే ఆషామాషీ విషయం కాదు. శివన్న ఎక్కడ ఎప్పుడు ఎవరితో డ్యాన్స్ చేశాడు అనే కదా డౌట్. తెలుసుకుందాం రండి. %గాలి జనార్ధనరెడ్డి కుమారుడు గాలి కిరీటి రెడ్డి జూనియర్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న విషయం తెల్సిందే. రాధాకృష్ణ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా జూలై 18 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఈ సినిమాలో కిరీటి సరసన శ్రీలీల నటిస్తుండగా.. జెనీలియా టాలీవుడ్ కి రీఎంట్రీ ఇస్తుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్, ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు సినిమాపై మరింత హైప్ ను క్రియేట్ చేసింది.

# టుడే స్పోర్ట్స్

# టీమిండియా టార్గెట్ 193..
## ఆరంభంలోనే జైస్వాల్ అవుట్..



లార్డ్స్‌లో జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా విజయానికి 193 పరుగుల దూరంలో ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ జట్టు 192 పరుగులకు ఆలౌట్ అయింది. వాషింగ్టన్ సుందర్ (4/22) ఇంగ్లండ్ వెన్ను విరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో రెండు జట్లు 387 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 62.1 ఓవర్లు ఆడి 192 పరుగులకు ఆలౌట్ అయింది ఇంగ్లండ్ బ్యాటర్లలో జో రూట్ (40), బెన్ స్టోక్స్ (33) మాత్రమే చెప్పుకోదగ్గ పరుగులు చేశారు. వాషింగ్టన్ సుందర్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ రెండేసి వికెట్లు తీశారు. నితీష్ కుమార్ రెడ్డి, ఆకాష్ దీప్ ఒక్కో వికెట్ తీశారు. మ్యాచ్‌లో భారత్ విజయం సాధించాలంటే 193 పరుగులు అవసరం. మరో రోజు మిగిలి ఉంది. కాగా, బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆరంభంలోనే జైస్వాల్ వికెట్ కోల్పోయింది. షార్ట్ పిచ్ బంతిని ఆడడంలో జైస్వాల్ (0) అంచనా తప్పింది. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో జేమీ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ప్రస్తుతం కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్ క్రీజులో ఉన్నారు. టార్గెట్ ఊరిస్తున్నప్పటికీ ఇది ఛేదించాలంటే టీమిండియా కాస్త చెమటోడ్చాల్సిందే. లార్డ్స్ మైదానంలో చివరి రోజు ఇంగ్లండ్ క్వాలిటీ బౌలర్లను ఎదుర్కొని ఈ టార్గెట్‌ను ఛేజ్ చేస్తే టీమిండియాకు ఈ సిరీస్‌లో రెండో విజయం దక్కుతుంది.

# ఏడేళ్ల తర్వాత కీలక నిర్ణయం..
## భర్తతో సైనా విడాకులు




ప్రముఖ బాట్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏడేళ్ల వివాహ బంధానికి వీడ్కోలు పలికారు. భర్త పారుపల్లి కశ్యప్‌తో విడాకులు తీసుకుంటున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాలో చెప్పుకొచ్చారు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో ..'కొన్నిసార్లు జీవితం మనల్ని వేరు వేరు దార్లలోకి తీసుకెళుతూ ఉంటుంది.

# వీడు మనిషా.. పక్షా?
## ఇలా పట్టేశాడేంట్రా బాబు!




ఆస్ట్రేలియా-వెస్టిండీస్ మధ్య జరుగుతున్న మూడో టెస్ట్‌లో ఓ అద్భుతం చోటుచేసుకుంది. కంగారూ స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ (20)ను ఓ స్టన్నింగ్ క్యాచ్‌తో వెనక్కి పంపించాడు అండర్సన్ ఫిలిప్స్. జస్టిన్ గ్రీవ్స్ బౌలింగ్‌లో గుడ్ లెంగ్త్‌లో పడిన బంతిని ఎక్స్‌ట్రా కవర్స్ మీదుగా భారీ షాట్‌గా మలిచేందుకు ప్రయత్నించాడు హెడ్. అయితే బాల్ కాస్త ఎక్కువగా బౌన్స్ అవడంతో షాట్ సరిగ్గా కనెక్ట్ కాలేదు. దీంతో మిడాఫ్ దిశగా గాల్లోకి లేచింది బంతి. అంతే దగ్గర్లో ఫీల్డింగ్ చేస్తున్న సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ అండర్సన్ ఫిలిప్స్ పరిగెత్తుకుంటూ వెళ్లి నమ్మశక్యం కాని రీతిలో క్యాచ్ అందుకున్నాడు.కుడి చేతి వైపు గాల్లో పక్షిలా ఎగురుతూ క్యాచ్ అందుకున్నాడు అండర్సన్ ఫిలిప్స్. బంతిని అందుకున్న సమయంలో అతడి శరీరం మొత్తం గాల్లోనే ఉండటం గమనార్హం. బాల్ పట్టాక శరీరాన్ని బ్యాలెన్స్ చేసుకొని లేచి సెలబ్రేట్ చేసుకున్నాడు ఫిలిప్స్. ఈ క్యాచ్ చూసి బ్యాటర్ ట్రావిస్ హెడ్‌తో పాటు విండీస్ ప్లేయర్లు కూడా షాక్ అయ్యారు. వాటే క్యాచ్ అంటూ షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత తేరుకొని అండర్సన్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఫ్లయింగ్ క్యాచెస్ చూడలేదని.. ఇది బెస్ట్ క్యాచ్ అంటూ నెటిజన్స్ ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. కాగా, ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 225 పరుగులకు ఆలౌట్ అయింది ఆసీస్. ఆ తర్వాత బ్యాటింగ్ మొదలుపెట్టిన విండీస్.. తొలి రోజు ఆట ముగిసేసరికి వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది.

# సినర్ కొత్త చరిత్ర




లండన్: డబుల్ డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కారజ్‌ను ఓడించిన టాప్ సీడ్ యానిక్ సినర్.. తొలిసారి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినర్ 4-6, 6-4, 6-4, 6-4తో రెండో సీడ్ అల్కారజ్ (స్పెయిన్)పై సునాయాసంగా నెగ్గాడు. దీంతో హ్యాట్రిక్ టైటిల్ నెగ్గాలన్న అల్కారజ్ స్వప్నం చెదరగా.. 148 ఏళ్ల టోర్నీ చరిత్రలో టైటిల్ నెగ్గిన తొలి ఇటాలియన్‌గా సినర్ రికార్డు సృష్టించాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అల్కారజ్ చేతిలో ఓడిన సినర్.. గ్రాస్ కోర్ట్‌లో గట్టిగా బదులు తీర్చుకొన్నాడు. మూడు గంటలకుపైగా సాగిన పోరులో అల్కారజ్ తొలి సెట్‌లో నెగ్గినా.. ఆ తర్వాత వరుసగా మూడు సెట్‌లు గెలిచిన సినర్ టైటిల్‌ను దక్కించుకొన్నాడు. మొదటి సెట్ ఐదో గేమ్‌లోనే అల్కారజ్ సర్వీసని బ్రేక్ చేసిన సినర్ 4-2తో ముందంజ వేశాడు. అయితే, ఎనిమిదో గేమ్‌లో బ్రేక్ పాయింట్ సాధించిన అల్కారజ్ 4-4తో సమం చేశాడు. ఇదే జోరులో వరుసగా రెండు గేమ్‌లు గెలిచి సెట్‌ను తన ఖాతాలో వేసుకొన్నాడు. అయితే, రెండో సెట్‌లో పుంజుకొన్న సినర్ 2-0తో పైచేయి సాధించాడు. మరోవైపు పట్టువదలకుండా పోరాడిన అల్కారజ్ 4-5తో నిలిచాడు. కానీ, చివరి గేమ్‌లో సర్వీసను నిలబెట్టుకొన్న సినర్..సెట్ నెగ్గి 1-1తో స్కోరు సమం చేశాడు.

# ఇంగ్లండ్ ఉత్కంఠ విజయం




బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌పై తొలిసారి టీ20 సిరీస్‌లో విజయం సాధించిన భారత మహిళల జట్టు.. ఆఖరి మ్యాచ్‌లో పోరాడి ఓడింది. చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఐదో టీ20లో భారత్ 5 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. కానీ, 3-2తో టీ20 సిరీసను భారత్ సొంతం చేసుకొంది. శనివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (75) మినహా అంతా విఫలమయ్యారు. చార్లీ డీన్ 3, ఎకెల్‌స్టోన్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ ఓవర్లన్నీ ఆడి 168/5 స్కోరు చేసి గెలిచింది. దీప్తి శర్మ, అరుంధతి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. చివరి 3 బంతుల్లో 5 పరుగులు అవసరమవగా.. ఎకెల్‌స్టోన్ (4 నాటౌట్) జట్టును గెలిపించింది.


# రాహుల్‌ను రెచ్చగొడుతున్నారు..
## చప్పట్లు కొడుతూ కవ్వించిన ఇంగ్లండ్ ప్లేయర్స్..




ఇంగ్లండ్‌లోని లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే చెరో టెస్ట్ మ్యాచ్ గెలిచి సమానంగా ఉన్న భారత్, ఇంగ్లండ్ జట్లు మూడో టెస్ట్ మ్యాచ్‌ను చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి . ఈ నేపథ్యంలో ఇరు జట్ల ఆటగాళు మైదానంలో తీవ్ర భావోద్వేగానికి గురవుతున్నారు. మూడో రోజు చివరి ఓవర్లో ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలీ సమయం వృథా చేయడానికి ప్రయత్నించడంతో టీమిండియా ఆటగాళు గట్టిగా స్పందించారు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తో సహా పలువురు ఆటగాళ్లు క్రీజులో ఉన్న క్రాలీ చుట్టూ చేరి చప్పట్లు కొట్టి వ్యంగ్యంగా స్పందించారు. దీంతో నాలుగో రోజు ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వగ తీర్చుకున్నాడు. టీమిండియా బ్యాటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇంగ్లండ్ అభిమానులు మైదానంలో చప్పట్లు కొడుతూ, కేకలు వేస్తూ ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. మైదానంలో ఇంగ్లండ్ ఆటగాళ్లు కూడా అదే ప్రయత్నం చేశారు. చివర్లో నైట్ వాచ్‌మెన్‌గా వచ్చిన ఆకాష్ దీప్ వైద్య సహాయం తీసుకున్న సమయంలో బెన్ స్టోక్స్ తీవ్రంగా స్పందించాడు

నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న కేఎల్ రాహుల్ దగ్గరకు వచ్చిన బెన్ స్టోక్స్ చప్పట్లు కొడుతూ ఏదో మాట్లాడాడు. ఆ క్రమంలో రాహుల్, స్టోక్స్ మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆ తర్వాత చివరి ఓవర్లో ఆకాష్ దీప్‌ను స్టోక్స్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో స్టోక్స్ కాస్త శ్రుతి మించి సంబరాలు చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే టీమిండియా మరో 135 పరుగులు చేయాలి. ఈ నేపథ్యంలో సోమవారం ఆట మరింత రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

# ఆస్ట్రేలియా 225 ఆలౌట్



కింగ్‌స్టన్: వెస్టిండీసతో శనివారం ప్రారంభమైన మూడో టెస్ట్ (డే/నైట్) తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 225 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా ఓ దశలో 157/3తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ ఈ దశలో వెస్టిండీస్ బౌలర్లు విజృంభించడంతో మిగిలిన ఏడు వికెట్లను కేవలం 68 పరుగులకే కోల్పోయింది. స్టీవెన్ స్మిత్ (48), గ్రీన్ (46) మాత్రమే రాణించారు. షామర్ జోసెఫ్ నాలుగు, జస్టిన్ గ్రీవ్స్, జేడెన్ సీల్స్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆతిథ్య జట్టు తొలిరోజు ఆఖరికి వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది. 100వ టెస్ట్ ఆడుతున్న ఆసీస్ పేసర్ స్టార్క్ ఒక వికెట్ దక్కించుకున్నాడు.

# టుడే బిజినెస్

# పసిడి ప్రియులకు అలర్ట్..

# మళ్లీ లక్ష రూపాయల చేరువలోకి బంగారం..




గత రెండు వారాల్లో 98 వేలకు సమీపంలో ఉన్న బంగారంవెండి (ధరలు ప్రస్తుతం తిరిగి లక్ష రూపాయలు చేరువ అవుతున్నాయి. పది గ్రాముల బంగారం ధర మళ్లీ లక్ష రూపాయలను దాటి ట్రేడ్ అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోజు (జులై 14న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 99, 700కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 91, 390కి చేరింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 99, 850కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 91, 540కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99, 700కి చేరుకోగా. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 91, 390కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# నష్టాలతోనే ప్రారంభం..

# ఈ రోజు టాప్ స్టాక్స్ ఇవే..




అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల నడుమ దేశీయ సూచీలు ఈ వారాన్ని నష్టాలతోనే ప్రారంభించాయి. టీసీఎస్ త్రైమాసిక ఫలితాలు నిరాశాజనకంగా ఉన్న నేపథ్యంలో ఐటీ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కాఫర్ దిగుమతులపై 50 శాతం సుంకం విధించడం, ఫార్మా ఉత్పత్తులపై కూడా భారీ పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో కదలాడుతున్నాయి.

గత శుక్రవారం ముగింపు (82, 500)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత వెంటనే నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో దాదాపు 400 పాయింట్లు కోల్పోయి 82, 109 వద్ద కనిష్టానికి చేరింది. ప్రస్తుతం ఉదయం 10:15 గంటల సమయంలో సెన్సెక్స్ 138 పాయింట్ల పాయింట్ల నష్టంతో 82, 361 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 31 పాయింట్ల నష్టంతో 25, 118 వద్ద కొనసాగుతోంది.సెన్సెక్స్‌లో వొడాఫోన్ ఐడియా, కేఈఐ ఇండస్ట్రీస్, పిరామిల్ ఎంటర్‌ప్రైజెస్, బీఎస్ఈ లిమిటెడ్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. దివీస్ ల్యాబ్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, మాజగాన్ డాక్, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 402 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 114 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.94గా ఉంది.

# జీతాల పెంపుపై టీసీఎస్‌లో అనిశ్చితి




ముంబై: జీతాల పెంపుపై ఐటీ దిగ్గజం టీసీఎస్ నోరు మెదపడం లేదు. జీతాల పెంపు ముఖ్యమైన విషయమే అయినా, లాభాలతో కూడిన అభివృద్ధి అంతకంటే ముఖ్యమని కంపెనీ సీఎఫ్ఓ సమీర్ సెక్సారియా తేల్చి చెప్పారు. దీంతో టీసీఎసలో జీతాల పెంపు ఎప్పుడు జరుగుతుందనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. సాధారణంగా టీసీఎసతో సహా ప్రధాన ఐటీ కంపెనీలు ఏటా ఏప్రిల్ నుంచి జీతాల పెంపు అమలు చేస్తాయి. అయితే ఈ సంవత్సరం ఏ ప్రధాన ఐటీ కంపెనీ కూడా జీతాల పెంపు గురించి ప్రకటించలేదు.అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇతర కారణాలతో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో టీసీఎస్ నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కేవలం ఆరు శాతం పెరిగింది. మార్చి త్రైమాసికం సైతం కంపెనీకి పెద్దగా కలిసి రాలేదు. దీంతో ఏప్రిల్ నుంచి అమలు చేయాల్సిన వార్షిక జీతాల పెంపు పక్కన పడింది. 'టీసీఎసలో జీతాలు పెంపు అరుదుగా మాత్రమే వాయిదా పడుతుంది, తిరిగి జీతాల పెంపునకు వెళ్లడమే నా ప్రాధాన్యత' అని సీఎఫఓ చెప్పడం విశేషం. దీంతో టీసీఎసలో జీతాల పెంపు ఇప్పట్లో ఉండకపోవచ్చని భావిస్తున్నారు. లాభాలకూ గండి: ప్రస్తుతం దేశీయ ఐటీ కంపెనీలు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలకు తోడు, ట్రంప్ సుంకాల పోటు పరిశ్రమను భయపెడుతోంది. ప్రధాన మార్కెట్లయిన అమెరికా, ఐరోపా నుంచి కొత్త ప్రాజెక్టులు పెద్దగా రావడం లేదు. వచ్చినా అరకొర ప్రాజెక్టులే. దీనికి తోడు చాలినంత ఏఐ నైపుణ్యాలున్న నిపుణులు దొరక్క, అనేక కంపెనీలు ఉన్న ప్రాజెక్టులనే సక్రమంగా పూర్తి చేయలేకపోతున్నాయి. టీసీఎసని కూడా ఇవే సమస్యలు వేధిస్తున్నాయి.

# 2030 నాటికి

# రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని ఎన్‌ఎల్‌సీ ఇండియా పెద్ద ఎత్తున వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందుకోసం 2030 నాటికి రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేయనుంది. కంపెనీ ఎండీ, సీఈఓ మోటుపల్లి ప్రసన్న కుమార్ పీటీఐ వీడియోసకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. దీంతో తమ స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుత 6,700 మెగావాట్ల నుంచి 2030 నాటికి 20,000 మెగావాట్లకు చేరుతుందన్నారు. వచ్చే ఐదేళ్లలో కంపెనీ ఖర్చు చేసే రూ.1.25 లక్షల కోట్లలో రూ.65,000 కోట్లు పునరుత్పాదక, హరిత ఇంధన ప్రాజెక్టులపై ఖర్చు చేస్తామన్నారు. మిగతా రూ.60,000 కోట్లలో రూ.45,000 కోట్లు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కోసం, మిగతా రూ.15,000 కోట్లు గనుల అభివృద్ధి కోసం ఖర్చు చేయబోతున్నట్టు ఆయన చెప్పారు. పునరుత్పాదక, హరిత ఇంధన ప్రాజెక్టులపై చేసే రూ.65,000 కోట్ల ఖర్చులో రూ.15,000 కోట్లు బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయబోతున్నట్టు వెల్లడించారు.

# బ్లాక్‌బస్టర్ ఫ్రైడే.. ఆర్బీఐ ఎఫెక్ట్,

# ఒక్క రోజులో 3.5 లక్షల కోట్లకు పైగా లాభం

ఇంటర్నెట్ డెస్క్: ఇవాళ భారత స్టాక్ మార్కెట్లు బ్లాక్‌బస్టర్ ఫ్రైడే )ని చవిచూశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటు తగ్గింపుతో నిఫ్టీ 25,000 మార్క్ దాటింది. బ్యాంక్ నిఫ్టీ అయితే, ఏకంగా రికార్డు గరిష్ట స్థాయికి చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఊహించిన దానికంటే ఎక్కువ రెపో రేటు తగ్గింపుతో పాటు నగదు నిల్వ నిష్పత్తి ి తగ్గింపుతో ఇవాళ (జూన్ 6)న భారత బెంచ్‌మార్క్ సూచీలు మూడవ సెషన్‌లోనూ లాభాలు మూటగట్టుకున్నాయి. ఇక, నిఫ్టీ మూడు వారాల్లో ఉత్తమ ట్రేడ్ డే ను నమోదు చేసింది.%శుక్రవారం వారాంతంలో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 746.95 పాయింట్లు లేదా 0.92 శాతం పెరిగి 82,188.99 వద్ద ఉంది. నిఫ్టీ 252.15 పాయింట్లు లేదా 1.02 శాతం పెరిగి 25,003.05 వద్ద ఉంది. ఇక, నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.2 శాతం పెరగగా, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం పెరిగాయి. ఇక, బిఎస్ఇ-లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ నిన్నటి రూ. 447.5 లక్షల కోట్ల నుండి రూ.451 లక్షల కోట్లకు పెరగడంతో పెట్టుబడిదారుల సంపద ఒక్కరోజులో రూ. 3.5 లక్షల కోట్లకు పైగా పెరిగింది.ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించాలనే నిర్ణయం %జువీ×%లను తగ్గిస్తుందని అంచనా వేయడం, హోం లోన్స్ ఇచ్చే బ్యాంకు షేర్లకు ఊతం వచ్చింది. దీంతో బ్యాంకింగ్ స్టాక్స్ తోపాటు రియాల్టీ ఇండెక్స్ 4 శాతం పెరిగింది. దీంతోపాటు, బంగారు రుణాలకు సంబంధించి లోన్-టు-వాల్యూ నిష్పత్తి పరిమితిని 85%కి పెంచుతామని ఆర్‌బిఐ చెప్పడంతో గోల్డ్ ఫైనాన్సింగ్ కంపెనీల షేర్లు 5 నుంచి 7 శాతం వరకూ పెరిగాయి.

# థర్మల్ ప్లాంట్లకు ఊరట



న్యూఢిల్లీ: బొగ్గు ఆ?ధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వ స్వల్ప ఊరట ఇచ్చిం ది. ఈ ప్లాంట్ల నుంచి వెలువడే వాయువుల్లో గంధకం (సల్ఫర్) శాతాన్ని నియంత్రించేందుకు ఉద్దేశించిన ఫ్లూ గ్యాస్ డిసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) యంత్ర పరికరాల ఏర్పాటు నుంచి కొన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు మినహాయింపు ఇచ్చింది. పది లక్షలకు మించి జనాభా ఉన్న నగరాలకు 10 కిలోమీటర్ల పరిధిలోని థర్మల్ ప్లాంట్లకు మాత్ర మే ఈ నిబంధనను పరిమితం చేసింది. దీని వల్ల యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు 25 పైసల నుంచి 30 పైసల వరకు తగ్గుతాయని తెలిపింది. దీనికి సంబంధించి ఆదివారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది.

# 25000 వద్ద నిలదొక్కుకోవడం కీలకం



నిఫ్టీ గత వారం కరెక్షన్‌లో కొనసాగుతూ వారం మొత్తానికి 300 పాయింట్ల పైగా నష్టంతో 25,150 వద్ద ముగిసింది. ముందువారంలో 25,000 వద్ద ఏర్పడిన బ్రేకౌట్‌కు ఇది పుల్‌బ్యాక్ రియాక్షన్‌గా భావించాలి. ఫలితంగా మరోసారి 25,000 సమీపంలోకి వచ్చింది. అలాగే మిడ్‌క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు కూడా గరిష్ఠ స్థాయిల నుంచి రియాక్షన్ సాధిస్తున్నట్టు కనిపిస్తోంది. టెక్నికల్‌గా ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉన్నప్పటికీ భద్రత కోసం 25,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

# భారత్-రష్యా చమురు వాణిజ్యంలో భారీ పెరుగుదల




న్యూఢిల్లీ: భారత రిఫైనరీలు పశ్చిమాసియాపై ఆధారనీయతను తగ్గించుకుంటూ రష్యా నుంచి ముడిచమురు దిగుమతులను మరింత పెంచుతున్నాయి. చమురు నిల్వలను పెంచేందుకు అవి చురుగ్గా కొనుగోళ్లకు దిగిన నేపథ్యంలో జూన్ నెలలో రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు గత 11 నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. రోజుకు 20.8 లక్షల బ్యారెళ్ల సరఫరాతో రష్యా మళ్లీ భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా నిలిచింది. అంతర్జాతీయ కమోడిటీ సంస్థ కెప్లర్ వెల్లడించిన గణాంకాల ప్రకారం జూన్‌లో దేశానికి మొత్తం ముడిచమురు దిగుమతులు 6 శాతం తగ్గినప్పటికీ, రష్యా నుంచి వచ్చే చమురు పరిమాణం మాత్రం నెలవారీగా 8 శాతం వృద్ధిని నమోదు చేసింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006